# ప్రజాతీర్పు 2024




## మూడు గంటల్లోగా నకిలీ కంటెంట్ తొలగించాలి

**రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం**

న్యూఢిల్లీ, మే 6: రాజకీయ పార్టీలకు వారి సోషల్ మీడియా వేదికల్లోని నకిలీ కంటెంట్ గురించి సమాచారం ఇచ్చిన మూడు గంటల్లోగా ఆ కంటెంట్‌ను తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆదేశించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించి కొందరు ప్రముఖ నాయకులు, సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలను వైరల్ చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించింది. కృత్రిమ మేధ(ఏఐ) టూల్స్‌ను దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడాలని హితవు పలికింది.



# జార్ఖండ్‌లో నోట్ల గుట్టలు

- కాంగ్రెస్ మంత్రి పీఏ పనిమనిషి ఇంట్లో భారీగా డబ్బు స్వాధీనం
- 35 కోట్లు సీజ్ చేశామన్న ఈడీ
- లోక్‌సభ ఎన్నికల వేళ కలకలం

రాంచీ, మే 6: లోక్‌సభ ఎన్నికల వేళ జార్ఖండ్‌లో పెద్దమొత్తంలో నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్ ఇంట్లో పనిచేసే ఓ వ్యకి నివాసంలో సుమారు రూ.35 కోట్ల నగదు స్వాధీనం చేసుకొన్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాంచీలోని గడిఖానా చౌక్ ఏరియాలోని మంత్రి పీఏ పనిమనిషి నివాసంలో డబ్బు కట్టలు ఉన్న బ్యాగులను సీజ్ చేశామని పేర్కొన్నది. గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ ఇంజినీర్ వీరేంద్ర కుమార్ రామ్‌పై నమోదైన మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు చేసినట్టు ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై వీరేంద్ర రామ్‌ను ఈడీ గత ఏడాది అరెస్టు చేసింది.

**తనకు సమాచారం లేదన్న మంత్రి**

తాజా సోదాలపై మంత్రి ఆలంగీర్ ఆలంను వార్తా సంస్థ పీటీఐ సంప్రదించగా.. దీనిపై తనకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని పేర్కొన్నారు. ఈడీ దర్యాప్తు పూర్తి చేసే వరకు ఎవరూ ఎలాంటి నిర్ణయానికి రావొద్దన్నారు. సంజీవ్ లాల్ గతంలో ఇద్దరు మాజీ మంత్రులకు కూడా కార్యదర్శిగా చేశారని పేర్కొన్నారు. హస్తం పార్టీలో కీలక నేతగా ఉన్న ఆలంగీర్ ఆలం ప్రస్తుతం పకూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, పెద్దమొత్తంలో దొరికిన నోట్ల కట్టలను లెక్కించేందుకు ఈడీ అధికారులు తీవ్రంగా శ్రమించారు. ఎనిమిది క్యాష్ కౌంటింగ్ మెషీన్లను ఉపయోగించి 17 గంటల పాటు లెక్కింపు చేపట్టారు. తాజా ఆపరేషన్‌లో భాగంగా ఈడీ మొత్తం ఆరుచోట్ల దాడులు చేసింది. వీటిల్లో రెండు చోట్ల జరిపిన సోదాల్లో రూ.2.93 కోట్లు, రూ.10 లక్షల చొప్పున ఏజెన్సీ రికవరీ చేసింది. కొంత బంగారాన్ని కూడా సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జార్ఖండ్‌లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ తాజా పరిణామం రాజకీయ దుమారం రేపింది. సోదాల్లో దొరికిన సొమ్ముతో కాంగ్రెస్ మంత్రికి ఉన్న సంబంధాలపై బీజేపీ ప్రశ్నలు లేవనెత్తింది. ఆలంగీర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబులాల్ డిమాండ్ చేశారు.

# అవినీతిపరులు దోచుకున్న సొమ్ము పేదలకే

## న్యాయ సలహా తీసుకుంటున్నా: మోదీ

రాజమహేంద్రవరం: అవినీతిపరులు దోచుకున్న సొమ్మును తిరిగి పేదలకు ఇవ్వడం కోసం న్యాయ సలహా తీసుకుంటున్నానని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని వేమగిరిలో జరిగిన ఎన్డీయే ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, జార్ఖండ్‌లోని ఓ వ్యక్తి ఇంటి నుంచి భారీగా నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. జార్ఖండ్ మంత్రి వద్ద పని చేస్తున్న కార్యదర్శికి పని మనిషి ఇంట్లో ఈ నగదు దొరికింది. ఇటువంటి వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలోని ప్రథమ కుటుంబం (గాంధీలు)తో ఎందుకు సన్నిహితంగా ఉంటున్నారోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొండంత కరెన్సీ కట్టలు దొరుకుతున్నాయని, వాటిని లెక్కపెట్టలేక కరెన్సీ కౌంటింగ్ యంత్రాలు అలసిపోతున్నాయని అన్నారు. వర్కర్ల ఇళ్లను నల్లధనాన్ని దాచుకునే గోదాములుగా మార్చారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు ఈడీ రూ.1.25 లక్షల కోట్లు జప్తు చేసిందని, మిగిలిన కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకున్న సొమ్మును కలిపితే ఇది మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ సొమ్మును ఎవరి నుంచి దోచుకున్నారో వారికి తిరిగి ఎలా ఇవ్వాలనే అంశంపై న్యాయ సలహా తీసుకుంటున్నానని చెప్పారు. ఇప్పటికే రూ.17,000 కోట్లను నిజమైన యజమానులకు తిరిగి ఇచ్చామన్నారు.

# మోదీ.. హామీల అమలేదీ?

*లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు 'మోదీ కీ గ్యారెంటీ' అంటూ ప్రచారాన్ని అందుకొన్నారు. అయితే 2014, 2019 ఎన్నికల సమయంతోపాటు అధికారం చేపట్టిన తర్వాత మోదీ ఇచ్చిన హామీలను చాలా వరకు గాలికొదిలేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, పంటలకు కనీస మద్దతు ధర, నల్లధనం వెనక్కి తదితర హామీలు ఒట్టి మాటలుగానే మిగిలిపోయాయి. ఇప్పుడు 'మోదీ కీ గ్యారెంటీ' అంటున్న బీజేపీకి.. గతంలో ఇచ్చిన హామీల సంగతేంటి? అని ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి.*

**2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపయిందా?**

ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇచ్చారా?

ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షలు పడ్డాయా?

అందరికీ ఇండ్లు, 24 గంటల విద్యుత్తు ఎక్కడ?

అమలుకు నోచుకోని ఏ ఒక్క వాగ్దానం

ఇప్పుడు 'మోదీ గ్యారెంటీ'లు అంటూ మళ్లీ ప్రచారం



న్యూఢిల్లీ, మే 6: గత రెండు లోక్‌సభ ఎన్నికల సమయాల్లో, అధికారం చేపట్టిన తర్వాత పలు సందర్భాల్లో కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చింది. ప్రధానంగా 2022 నాటికి రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. దేశంలోని నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెప్పింది. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని దేశానికి వెనక్కి తీసుకొచ్చి, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ ప్రచార సభల్లో ఊదరగొట్టారు. వీటిల్లో ఒక్కటి కూడా అమలు చేసిన పరిస్థితి లేదు.

**ఆదాయం కాదు.. ఆత్మహత్యలు రెట్టింపు**

ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ హయాంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. 2022 నాటికి దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016 ఫిబ్రవరిలో ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఆదాయం పెరుగుదల విషయం అటుంచితే, దేశంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగాయి. 2014 నుంచి 2023 వరకు దాదాపు లక్షా 12 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారని ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పైగా అన్నదాతల నడ్డివిరిచేలా వివాదాస్పద వ్యవసాయ చట్టాలను మోదీ సర్కార్ తీసుకొచ్చింది. వీటిపై దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమం చేపట్టడంతో వాటిని ఉపసంహరించుకున్నది.

**మోదీ సర్కార్ ఉపాధి కల్పన తీరు**

పదేండ్లలో భర్తీ చేస్తామన్న ఉద్యోగాలు- 20 కోట్లు

ఇప్పటి వరకు భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలు- 7 లక్షలు

హామీలో భర్తీ చేసిన వాటా- 0.35%

**20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా?**

ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు కల్పిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి పదేండ్లు గడిచినా ఆ హామీ ని నిలబెట్టుకోలేదు. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువకుల్లో దాదాపు సగం మంది ఉపాధి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొన్నది.

**నల్లధనం వెనక్కు తెచ్చారా?**

విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం భారీగా మూలుగుతున్నదని, దాన్ని వెనక్కు తీసుకొచ్చి దేశ ప్రజలకు పంచుతామని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. అయితే ఒక్కరి ఖాతాలో కూడా రూపాయైనా జమ కాలేదు. ఇది బీజేపీ చెప్పిన మరొక ఝూటా మాట అని చెప్పొచ్చు.

**బుల్లెట్ రైలు పరుగులు ఎక్కడ?**

దేశంలో 2022 నాటికి బుల్లెట్ రైలును అందుబాటులోకి తీసుకొస్తామని 2018 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. జపాన్ సహకారంతో ముంబై-అహ్మదాబాద్ మధ్య ఈ రైలును నడుపుతామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే బుల్లెట్ రైలు ఇప్పటికీ పట్టాలెక్కలేదు. గడువును ప్రభుత్వం ఏటికేడు పొడిగించుకుంటూ పోతున్నది. 2026నాటికి బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తుందని ఇటీవల రైల్వే మంత్రి పేర్కొన్నారు.

**దారుణంగా దెబ్బతిన్న ఆర్థికం!**

2022 నాటికి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని మోదీ చెప్పుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా తయారైందనే విమర్శలు వస్తున్నాయి. ద్రవ్యోల్బణంతో సామాన్యుడు అతలాకుతలం అవుతున్నాడు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ఇతర వస్తువులపై పడుతున్నది. మరోవైపు అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎన్నడూ లేని విధంగా అధఃపాతాళానికి పడిపోయింది.

**అందరికీ ఇండ్లు.. అందని ద్రాక్షేనా?**

2022 నాటికి దేశంలో ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం అవుతుందని 2018 జూలైలో ప్రధాని మోదీ ప్రకటించారు. అయితే పీఎం ఆవాస్ యోజన కింద ఇండ్ల నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. ఈ పథకం కింద 1.2 కోట్ల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకొన్న కేంద్ర ప్రభుత్వం.. అందులో విఫలమైంది. దీంతో గడువును మరోసారి పెంచింది.

**24 గంటల విద్యుత్తు.. పగటి కలే**

2022 నాటికి ప్రతి ఇంటికి నిరంతర విద్యుత్తు అందిస్తామని, దేశంలో చీకట్లు పారద్రోలుతామని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారు. అయితే ఇచ్చిన హామీ పెండింగ్‌లోనే ఉండిపోయింది. దేశంలో ఇంకా చాలా ఇండ్లకు విద్యుత్తు కనెక్షన్లు లేవు.

## నామినేషన్ విత్‌డ్రాకు బీజేపీ ఒత్తిడి

**ఆరెస్సెస్ మాజీ ప్రచారక్ ఆరోపణలు**

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని తనపై బీజేపీ నేతలు ఒత్తిడి తెచ్చారని ఆరెస్సెస్ మాజీ ప్రచారక్ అభయ్ జైన్ సోమవారం ఆరోపించారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, ధన బలం, కండ బలంతో కూడిన రాజకీయాలు లేని ఇండోర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యేలు కైలాశ్ విజయవర్గీయ, రమేశ్ మెండోలా సహా నలుగురు బీజేపీ నేతలు ఏప్రిల్ 27న తనను కలిశారని చెప్పారు. తాను ఎన్నికల్లో పోటీ చేయడాన్ని చూడలేకపోతున్నామని, తిరిగి ప్రచారక్‌గా పని చేయాలని కోరారని చెప్పారు. తాను అందుకు తిరస్కరించానన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి గోవింద్ మలు స్పందిస్తూ ప్రచారం కోసమే ఆయన ఈ విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆరెస్సెస్ మాజీ ప్రచారక్‌లు ఏర్పాటు చేసిన జనహిత్ పార్టీకి గుర్తింపు లభించకపోవడంతో, అభయ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

## రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వెల్లడి

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలను పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ప్రకటించనున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) తెలిపింది. దీనికోసం ఈసీకి చెందిన ఓటర్ టర్నవుట్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను జత చేసినట్లు పేర్కొంది. ఆ రోజు రాత్రి 7 గంటల వరకు ఈ విధంగా చేయనున్నట్లు వివరించింది. రాత్రి 7 గంటల తర్వాత ఈ కాల పరిమితిని తొలగించి, పోలింగ్ పార్టీలు రావడాన్ని బట్టి నిరంతరం పోలింగ్ సమాచారాన్ని అప్‌లోడ్ చేయనున్నట్లు చెప్పింది.

# జ్వలిస్తున్న కర్ణాటక

- రాష్ట్రంలో ప్రకంపనలు రేపుతున్న ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వ్యవహారం
- వీడియోలు బయటకు రావడంతో ఇండ్లు విడిచి వెళ్తున్న బాధితులు
- హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసిన ప్రభుత్వం
- బీజేపీ, జేడీఎస్‌పై తీవ్ర వ్యతిరేకత
- లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం



ఇటీవల ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రజ్వల్‌తో కలిసి పాల్గొన్న ప్రధాని మోదీ

బెంగళూరు, హసన్, మే 6: జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ వ్యవహారం కర్ణాటకలో రాజకీయ దుమారం రేపుతున్నది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొత్తం సెక్స్ స్కాండల్ చుట్టూనే తిరిగింది. మూడో విడతలో భాగంగా రాష్ట్రంలోని తక్కిన 14 స్థానాలకు సోమవారం ఎన్నికలు జరుగనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ సీట్లన్నిటినీ బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే ప్రజ్వల్ వ్యవహారం నేపథ్యంలో ఈసారి బీజేపీ సీట్లకు భారీగా కోత పడే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. సెక్స్ వీడియోల గురించి బీజేపీకి ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు కుదుర్చుకోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని కమలనాథులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రజ్వల్ వంటి వారిని ఉపేక్షించే అవకాశమే లేదని చెప్పుకొచ్చారు. ప్రజ్వల్ దేశం విడిచి వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కాంగ్రెస్ సర్కారును విమర్శించారు. ఇది శాంతిభద్రతలకు సంబంధించిన విషయం అయినందున, దీనిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపైనే ఉంటుందన్నారు.

**మాయమవుతున్న బాధితులు**

వీడియోల్లో కనిపించిన పలువురు బాధిత మహిళలు ఇండ్ల నుంచి మాయం అవుతున్నారు. కొందరి ఇండ్లకు గత కొన్ని రోజులుగా తాళాలు వేసి కనిపిస్తున్నాయి. తమ గుర్తింపు బయటపడటంతో బాధితులు భయంతో, తమకు కళంకం వస్తుందనే ఆందోళనతో ఇల్లు విడిచి వెళ్లిపోతున్నట్టు తెలుస్తున్నది. దీనిపై హసన్‌కు సమీపంలోని ఓ దుకాణదారుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడారు. 'జిల్లా మొత్తం రేవణ్ణ చేతుల్లో ఉంది. వాళ్ల గురించి చెడుగా మాట్లాడితే వారికి వెంటనే తెలిసిపోతుంది. వాళ్ల కుటుంబానికి, పార్టీకి ఇక్కడ చాలా మంది మద్దతుదారులున్నారు' అని అతడు తెలిపారు. ప్రజ్వల్‌పై ఫిర్యాదు చేసిన జెడ్పీ మాజీ సభ్యురాలు ప్రస్తుతం కనిపించకుండా పోయారని ఆమె గ్రామస్థులు చెప్పారు. జేడీ(ఎస్)లో చురుగ్గా పనిచేసిన మహిళా కార్యకర్తలు తాము ప్రజ్వల్‌తో తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగిస్తున్నారు. వారి భర్తలు ప్రజ్వల్‌తో తమ భార్యలకు ఉన్న సంబంధాల గురించి ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో చాలా మంది మహిళల జీవితాలను సెక్స్ స్కాండల్ వీడియోలు అభద్రతలో పడేశాయి' అని జేడీఎస్ స్థానిక నాయకుడు ఒకరు చెప్పారు. రేవణ్ణ కుటుంబంతో ఒక కేసులో పోరాడుతూ హసన్‌లో బతకడం అసాధ్యమని ఒక దుకాణదారుడు వ్యాఖ్యానించారు.

**రేవణ్ణ ఇంట్లో తనిఖీలు**

ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బెంగళూరులోని బసవనగుడిలో గల మాజీ ఎమ్మెల్యే, ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ ఇంట్లో సోమవారం తనిఖీలు నిర్వహించి కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకొంది. తనిఖీల సమయంలో తనను ఇంట్లోకి అనుమతించకపోవడంపై రేవణ్ణ తరపు న్యాయవాది గోపాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తనిఖీలు ఏక పక్షంగా సాగాయని విమర్శించారు. మరోవైపు ప్రజ్వల్ స్వదేశానికి త్వరలో తిరిగి రావొచ్చనే అంచనాల నేపథ్యంలో బెంగళూరు విమానాశ్రయం వద్ద భద్రత సిబ్బంది అప్రమత్తం అయ్యారు.

## హెల్ప్‌లైన్ ప్రారంభించిన సిట్

*హసన్ ఎంపీ ప్రజ్వల్ లైంగిక దాడి కేసులో బాధితుల కోసం హెల్ప్ లైన్(6360938947) ప్రారంభించినట్టు సిట్ అధిపతి బీకే సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని.. తామే వ్యక్తిగతంగా వారిని కలుస్తామని స్పష్టం చేశారు. ప్రజ్వల్ కొందరు మహిళను లైంగికంగా వేధిస్తున్న వీడియోలను ప్రజలెవరూ షేర్ చేయొద్దని ఆయన హెచ్చరించారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియోలు షేర్ చేయడం వల్ల బాధితుల పరువు, గౌరవం దెబ్బతింటాయని తెలిపారు.*

## సూరత్ అభ్యర్థిని బలపరచినవారిపై కాంగ్రెస్ ఫిర్యాదు

సూరత్, మే 6: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను బలపరచినవారిపై ఆ పార్టీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభనిని బలపరుస్తూ ముగ్గురు వ్యక్తులు ఆయన నామినేషన్‌పై సంతకాలు చేశారు. అయితే ఆ సంతకాలు తమవి కాదని, తమ సంతకాలను ఫోర్జరీ చేశారని వీరు ఆరోపించడంతో నీలేష్ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో సూరత్ కాంగ్రెస్ లీగల్ సెల్ సోమవారం సూరత్ పోలీస్ కమిషనర్ అనుపమ్ సింగ్ గహ్లౌత్‌కు ఫిర్యాదు చేసింది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ సౌరభ్ పర్ధిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం, మిగిలిన అభ్యర్థులు నామినేషన్లు విత్‌డ్రా చేసుకోవడంతో సూరత్‌లో బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

# నేడే మూడో విడత

- 11 రాష్ట్రాల్లోని 93 స్థానాలకు పోలింగ్
- బీజేపీకి ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నికలు
- గత ఎన్నికల్లో ఇవే స్థానాల్లో మెజార్టీ సీట్లు కైవసం
- ప్రజ్వల్ వ్యవహారం, రాజ్‌పుత్‌ల వ్యతిరేకతతో ఈ సారి భారీగా సీట్లకు కోతపడే అవకాశం



*బెంగాల్‌లో ట్రాక్టర్‌పై ఎన్నికల సామగ్రి తరలింపు*

అహ్మదాబాద్/బెంగళూరు, మే 6: మూడో విడత లోక్‌సభ ఎన్నికల సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. 11 రాష్ట్రాల్లోని 93 నియోజకవర్గాలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 1300 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, జ్యోతిరాదిత్య సింధియా, మన్సుఖ్ మాండవీయ, పురుషోత్తం రూపాలా, ప్రహ్లాద్ జోషీతోపాటు అఖిలేశ్‌యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, దిగ్విజయ్ సింగ్, సుప్రియాసూలే తదితర ప్రముఖుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్దేశించనున్నారు. గుజరాత్‌లో ఇండోర్ స్థానాన్ని బీజేపీ ఏకగ్రీవం చేసుకోగా, తక్కిన 25 స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే మహారాష్ట్రలో 11, యూపీ 10, కర్ణాటక 14, మధ్యప్రదేశ్ 9, ఛత్తీస్‌గఢ్ 7, బీహార్ 5, అస్సాం, పశ్చిమబెంగాల్‌లో నాలుగు చొప్పున, గోవా 2, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూలో ఒక్కో స్థానం చొప్పున స్థానాలకు ఈ దశలో పోలింగ్ జరుగనున్నది. మూడో దశ తర్వాత మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గానూ 283 స్థానాలకు ఓటింగ్ పూర్తవుతుంది.

**బీజేపీకి పరీక్ష**

మూడో విడత ఎన్నికలు బీజేపీకి కీలకంగా మారనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ మెజార్టీ సీట్లు సాధించిన గుజరాత్, కర్ణాటక, బీహార్, మధ్యప్రదేశ్ లోక్‌సభ స్థానాలకు ఈ దశలోనే ఎన్నికలు జరుగనున్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్‌స్కాండల్ ఆరోపణలు, గుజరాత్‌లో బీజేపీపై రాజ్‌పుత్‌ల ఆగ్రహం నేపథ్యంలో బీజేపీకి ఈ దశ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. కర్ణాటకలో ఈ విడత ఎన్నికలు జరిగే 14 సీట్లనూ గత ఎన్నికల్లో బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే ప్రజ్వల్ వ్యవహారం నేపథ్యంలో ఈసారి సీట్లకు భారీ కోత పడే అవకాశం ఉన్నది. గత ఎన్నికల్లో గుజరాత్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా, ఈసారి రాజ్‌పుత్‌ల వ్యతిరేకత ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీయొచ్చని విశ్లేషకులు అంటున్నారు.

# బీజేపీ అభ్యర్థులకు రైతుల సెగ

- పంజాబ్‌లో ప్రచారాన్ని అడ్డుకుంటున్న అన్నదాతలు
- డిమాండ్లపై ఎక్కడికక్కడ నిలదీత
- జోక్యం చేసుకోవాలని ఈసీకి బీజేపీ ఫిర్యాదు



*అజ్నాలాలో బీజేపీ అభ్యర్థికి నిరసన తెలుపుతున్న రైతు సంఘాల సభ్యులు(ఫైల్)*

పటియాలా, మే 6: పంజాబ్‌లో బీజేపీ అభ్యర్థులకు, నాయకులకు రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన సెగ ఎదురవుతున్నది. బీజేపీ ఎన్నికల ప్రచారం ఎక్కడ ఉంటే.. అక్కడ నల్ల జెండాలతో రైతులు నిరసనకు దిగుతున్నారు. తమ డిమాండ్లపై బీజేపీ అభ్యర్థుల్ని అన్నదాతలు నిలదీస్తున్నారు. అయితే.. రైతుల పేరుతో ఆప్, ఎస్ఏడీ (శిరోమణి అకాలీదళ్), కాంగ్రెస్ పార్టీలు బీజేపీ ప్రచారాన్ని అడ్డుకుంటున్నాయని, తమ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖర్ ఆరోపిస్తున్నారు. దీనిపై బీజేపీ నాయకుల బృందం సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే తమ హక్కును కాలరాస్తున్నారని ఈసీకి ఒక మెమోరాండం సమర్పించింది. ఆప్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు ఒక్కటై బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని బలవంతంగా నిలిపివేస్తున్నారని జాఖర్ ఆరోపించారు. బలవంతంగా తమ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవటం ఘర్షణలు, హింసకు దారి తీస్తున్నదని తెలిపారు. ఈ అంశంపై ఈసీ జోక్యం చేసుకోవాలని కోరారు.

**పటియాలాలో రైతు హత్య..**
**బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్**

పటియాలా లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ప్రణీత్ కౌర్‌కు వ్యతిరేకంగా నిరసన దిగటాన్ని సహించలేని కొంతమంది ఓ రైతు ప్రాణాల్ని బలితీసుకున్నారు. మే 4న జరిగిన ఈ ఘటనలో పోలీసులు అక్కడి బీజేపీ నేత హర్విందర్ సింగ్ హర్పాల్‌పూర్‌పై కేసు నమోదుచేశారు. ఈ ఘటనపై స్పందించిన 'కిసాన్ మజ్దూర్ మోర్చా', బీజేపీ నేత హర్పాల్‌పూర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే బుధవారం ప్రణీత్ కౌర్ ఇంటి ముందు రైతులు నిరసనకు దిగుతారని హెచ్చరించింది.

# సీఎం కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ కేసు!

మొదటిపేజీ తరువాయి...

సోమవారం వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నివేళ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని మంగళవారం పరిగణనలోకి తీసుకొంటామని సుప్రీంకోర్టు గత వారం చెప్పిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. దేవేంద్ర పాల్ భుల్లార్‌ను విడుదల చేయడంలో సహకరించేందుకుగానూ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి తీవ్రవాద ఖలిస్థానీ గ్రూపుల నుంచి రూ.133 కోట్ల మేర ఫండింగ్ వచ్చిందనే ఫిర్యాదు గవర్నర్‌కు అందిందని లేఖలో పేర్కొన్నారు. ఫిర్యాదుదారు సమర్పించిన ఎలక్ట్రానిక్ ఆధారాలపై ఫోరెన్సిక్ పరీక్షతోపాటు దర్యాప్తు జరుపాలని సక్సేనా లేఖలో కోరినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

**రూ.133 కోట్ల ఫండింగ్ ఆరోపణలు**

వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి అశూ మోంగియా నుంచి ఏప్రిల్ 1న సక్సేనాకు ఫిర్యాదు అందిందని హోంశాఖకు రాసిన లేఖలో ఎల్జీ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. 2014-2022 మధ్య ఖలిస్థాన్ గ్రూపుల నుంచి ఆప్ రూ.133 కోట్ల నిధులు అందుకొన్నదని ఆరోపిస్తూ ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ విడుదల చేసిన ఓ వీడియోను ఫిర్యాదుదారు ప్రస్తావించారని తెలిపారు. ఫిర్యాదుదారు ఆరోపణల తీవ్రత నేపథ్యంలో ఈ అంశంపై ఎన్ఐఏతో సమగ్ర దర్యాప్తునకు ఎల్జీ సిఫారసు చేశారని అందులో పేర్కొన్నారు. 2014 కెనడా, అమెరికా పర్యటన సమయాల్లో కేజ్రీవాల్ పలువురు ఖలిస్థానీ నేతలతో అంతర్గత చర్చలు జరిపారని, ఆ సమావేశాల్లో భుల్లార్‌ను విడుదల య్యేలా చూస్తామని వాళ్లకు హామీ ఇచ్చారని ఎల్జీకి చేసిన ఫిర్యాదులో ఆరోపించారు.



**ఎవరీ దేవేంద్ర భుల్లార్?**

1993లో జరిగిన ఢిల్లీ బాంబు పేలుడులో తొమ్మిది మంది మృతి చెందిన కేసులో దోషిగా తేలిన భుల్లార్ ప్రస్తుతం అమృత్‌సర్ సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. భుల్లార్‌ను ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా 2015 జూన్‌లో తీహార్ జైలు నుంచి అమృత్‌సర్ సెంట్రల్ జైలుకు మార్చారు. 2023 డిసెంబర్‌లో భుల్లార్ ముందస్తు విడుదలను ఢిల్లీ ప్రభుత్వ శిక్షా సమీక్షా బోర్డు తిరస్కరించింది. భుల్లార్ కేసు ముందస్తు విడుదలకు అర్హమైనది కాదని, అలాంటి వ్యక్తి విడుదల అయితే దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికి భంగం కలుగుతుందని బోర్డు అభిప్రాయపడినట్టు మీటింగ్ మినిట్స్ పేర్కొన్నది.

**బీజేపీకి ఓటమి భయం: ఆప్**

తాజా పరిణామాలపై ఆప్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ సూచన మేరకు కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా మరో కుట్ర జరుగుతున్నదని ఆ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. 'వాళ్లకు(బీజేపీ) లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొన్నది. ఢిల్లీలోని ఏడు సీట్లలో పరాజయం ఖరారైంది' అని అన్నారు. ఎల్జీ సక్సేనా అధికార బీజేపీకి ఏజెంట్‌గా మారారని తీవ్ర విమర్శలు చేశారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ బీజేపీ ఈ విధమైన కుట్ర పన్నిందని పేర్కొన్నారు. 'ఎన్నికల వేళ వార్తల్లో హెడ్‌లైన్స్ సృష్టించాలని ఎల్జీ సాబ్ ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ కార్యాలయాన్ని ఇది దుర్వినియోగం చేయడమే. ఇదే విషయంలో ఉన్నత స్థాయి జరిపించాలని కోరుతూ దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు రెండేండ్ల క్రితం కొట్టివేసింది. జగదీశ్ శర్మ అనే వ్యక్తి వేసిన పిల్ పూర్తిగా పనికిమాలినదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు' అని భరద్వాజ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

**మధ్యంతర బెయిల్‌పై నేడు నిర్ణయం!**

మద్యం పాలసీ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల వేళ మధ్యంతర బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకోనున్నది. మిగతా దశల లోక్‌సభ ఎన్నికల్లో కేజ్రీవాల్ పాల్గొంటారా? లేదా? అనేది న్యాయస్థానం తీర్పుపై ఆధారపడి ఉన్నది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేయనున్నది.